# ఫోటో

కె. శ్రీదేవి



సుజాత హడావుడిగా ఇల్లంతా తిరిగేస్తోంది. ఆ రోజు మధ్యాహ్నం వచ్చిన ఉత్తరం ఆమెకు పట్టలేనంత ఆనందాన్ని కలిగిస్తోంది.

"అమ్మాయి నచ్చిందట. ముహూర్తాలు పెట్టుకోడానికి వచ్చే గురువారం వస్తామని రాశారు వాళ్లు" తల్లి కమలమ్మతో రాఘవయ్య చెప్పడం విన్న సుజాత గుండె జల్లంది.

ఆమె ఏ మాత్రం ఈ సంబంధం కుదురుతుందని అనుకోలేదు. ఇంతకు ముందు సంబంధంలా ఇదీ గోవిందా అనే అనుకుంది. 'కళ్యాణ మొచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు. తనకు పెళ్లి ఘడియలొచ్చాయన్న మాట' అనుకుంటూ పులకరించిపోయింది సుజాత.

సుజాత చదువు అంతంత మాత్రంగా సాగింది. దానికి కారణాలెన్నో ఉన్నాయి. వాళ్లది పల్లెటూరు. అక్కడ ఏడో తరగతి వరకే చదివేందుకు అవకాశం ఉంది. నాలుగు మైళ్లు నడిచి వెళ్తేనే ఆపై చదివే వీలుంటుంది. సుజాత తల్లిదండ్రులు అంతగా చదువుకున్న వాళ్లు కారు. చదువు విలువ తెలియని వాళ్లకు సుజాతను చదువు కోసం అంత దూరం పంపడం అనవసరమే

అన్పించింది. దాంతో సుజాత చదువు ఏడో తరగతితోనే ఆగిపోయింది.

సుజాతకు వయసొచ్చిన దగ్గర్నుంచీ సంబంధాలు చూస్తున్నా ఏ సంబంధం కుదరలేదు. సహజంగా వ్యవసాయదారుడైన రాఘవయ్యకు తన కూతుర్ని మట్టి పిసుక్కునే వాడికివ్వగూడదనే సంకల్పం గట్టిగా ఏర్పడింది. కానీ ఉద్యోగస్తులందరూ ఉద్యోగం చేసే అమ్మాయి, కనీసం బాగా చదివిన అమ్మాయి కావాలన్నారు. కట్నం ఎంత ఎక్కువ ఇస్తామన్నా ఎవరూ సుజాతను పెళ్లి చేసుకోవడానికి ఇష్ట పడలేదు. రాఘవయ్యకు మొదటిసారిగా ఆడపిల్లకైనా చదువెంత అవసరమో తెలిసొచ్చింది. కానీ రాఘవయ్య పట్టు విడవక ఎలాగైతేనే ఈ సంబంధం కుదర్చగలిగాడు.


అనుకున్నట్టుగా పెళ్లివారు రావడం, ముహూర్తాలు పెట్టుకోవడం జరిగిపోయాయి. వరుడు రమేష్ సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగి. కొద్దో గొప్పో ఆదర్శ భావాలున్నవాడు. సుజాతలో మంచితనం, అమాయకత్వం గ్రహించి ఆమెను పెళ్లాడడానికి అంగీకరించాడు. అంతే గాకుండా పెళ్లి కోసం పెద్ద ఆర్భాటాలేవీ కోరలేదు. రమేష్‌లో మంచితనం గ్రహించిన రాఘవయ్య పొందిన ఆనందానికి అంతులేదు.

* * *

సుజాతకు పెళ్లి కుదిరిందన్న ఆనందంతో పాటు అమ్మానాన్నలను వదిలి వెళ్లాలనే బెంగ పట్టుకుంది. ఇంటి చుట్టూ ఉన్న కొబ్బరిచెట్లూ, వేప, తాటి చెట్లూ తడిమి చూసుకుంది. పూల మొక్కలతో మూగబాసలాడింది. పాకల్లో ఉన్న పశువుల మేను ఆప్యాయంగా నిమిరింది. లేగదూడల మెడలు కావలించుకుంది. ఆమెలో వచ్చిన కొత్త మార్పును గ్రహించాయో ఏమో ఆ మూగ జీవులు గొంతు సవరించుకుంటూ చిన్న పిల్లల్లా గారాలు పోయాయి.

సుజాత పెళ్లి పనులు పసుపు కొట్టడంతో మొదలై చురుగ్గా జరుగుతున్నాయి. సుజాతకు కొంత అవగాహన వచ్చిన దగ్గర్నుంచీ కొన్ని కోరికలున్నాయి. చూస్తే అవి పెద్ద కోరికలేమీ కాదు. కానీ తల్లిదండ్రుల చాటున పెరిగిన సుజాత ఆ కోరికలు అమ్మతో చెప్పడానికి వెనుకాడింది. అయితే ఒక్కగానొక్క కూతురూ పెళ్లయి అత్తవారింటికి వెళ్లిపోతుందన్న దిగులుతో కూడిన ప్రేమతో రాఘవయ్య సుజాత తల నిమురుతూ "నీకేమన్నా కావాలంటే చెప్పు తల్లీ" అన్నాడు.

సుజాత తనకు లభించిన ఈ అవకాశాన్ని విడిచి పెట్టలేదు. "నాన్నా! నాకొక గడియారం, సూట్ కేస్ కొనిపెట్టు చాలు" అంది. ఎంత ధైర్యం




తెచ్చుకుని చెప్పినా ఆమె మాటల్లో భయంతో కూడిన వణుకు కనిపిస్తూనే ఉంది.

రాఘవయ్య కాస్సేపటి దాకా ఏమీ మాట్లాడలేదు. తండ్రి మౌనం సుజాతకు బాధ కలిగించింది. తన కోరిక తీరదనే నిశ్చయాని కొస్తున్న క్షణంలో రాఘవయ్య కుమార్‌ను పిలిచి చెప్పాడు. "ఒరేయ్! రేపు సుజాతను పట్నం తీసుకువెళ్లి ఒక మంచి గడియారం, సూట్ కేస్ కొని పెట్టరా. నేను వెళ్లడానికి ఇక్కడ చాలా పనులు ఉన్నాయి. అదీ గాక నాణ్యతా నాకు తెలీదు."

"అలాగే మామయ్యా" అన్నాడు కుమార్. అతడు రాఘవయ్య మేనల్లుడు. టౌన్లో ఏదో ఉద్యోగంలో ఈ మధ్యనే చేరాడు. అప్పుడప్పుడూ వచ్చి రాఘవయ్యతో సుజాతతో పట్నం కబుర్లు చెప్పి నవ్విస్తూ ఉంటాడు. కుమార్ కుటుంబం ధనికులు కాకపోవడం చేతనో ఏమో, రాఘవయ్య గాని, అతని బావగాని వియ్యమందే ప్రయత్నం చేయలేదు.

తండ్రి మాటలతో మరింత పొంగిపోయింది సుజాత. కొందరు ఆడవాళ్లు అత్యాశతో తండ్రినీ, భర్తను వేధిస్తే మరి కొందరు స్త్రీలు తండ్రి, భర్త తీర్చే చిన్న చిన్న కోర్కెలకు జీవితాంతం మురిసిపోవడం నిజంగా ఆశ్చర్యం కలిగించే విషయం.

* * *


సుజాత పెళ్లి బాగా జరిగిందనే చెప్పాలి. ఎందుకంటే ఆ పల్లెలో చాలామంది రాఘవయ్య ఇంతకు ముందెన్నడూ జరగనంత గొప్పగా పెళ్లి చేశాడని చెప్పుకున్నారు. సుజాతను కాపురానికి పంపిస్తూ కన్నీళ్ల పర్యంతమయ్యారు ఆమె తల్లిదండ్రులు. ఆమె కూడా కన్నవారినీ, ఆ వాతావరణాన్నీ, చెట్లనూ, పశువులనూ పేరు పేరునా పలకరిస్తూ కన్నీరు కార్చింది.

ఇంటి ముందు అత్త వారింటి ప్రయాణానికి అలంకరించి సిద్ధమై ఉన్న టాక్సీ చూడగానే సుజాత మురిసిపోయింది. ఇంత ఘనంగా పెళ్లి జరిపించిన తన తండ్రి ఎంతో ఉన్నతంగా కనిపించా డామెకు. సుజాత టాక్సీలోకి ఎక్కేసరికి చిరునవ్వుతో కనిపించాడు రమేష్. భర్త పట్ల ఆమె ఎంత అనురాగాన్ని హృదయంలో దాచుకున్నా భయం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇంతలో ఇంకో ఆరుగురు ఆడంగులు తోసుకుంటూ టాక్సీలోకి ఎక్కారు. వాళ్లలో కొందరి ఒడిలో చిన్న పిల్లలు చేరడంతో ఆ టాక్సీ ఒక భారతదేశంలా క్రిక్కిరిసిపోయింది. కొత్తగా పెళ్లైన వారిని గమనించాలనే ఆసక్తో, లేక టాక్సీ ఎక్కాలనే ఆరాటమో తెలీదు గానీ, అంత మంది ఒక టాక్సీలో ప్రయాణించవలసి రావడం నిజంగా ఆ కొత్త జంటకు భరించలేని సందడి అవుతుంది.

అత్త వారింట్లో సుజాతకు మంచి ఆదరణ లభించింది. అత్తమామలు, మరిది, ఒక్కగానొక్క ఆడపడుచు ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. చాలా తక్కువ కాలంలోనే ఆమె పుట్టినింటి వారి గురించి ఆలోచించడమే మరిచిపోయే స్థితికి చేరిందంటే, ఆమె ఎంత అదృష్టవంతురాలైన కోడలో ఎవరైనా అర్థం చేసుకోవచ్చు.

* * *

"వదినా!వదినా!" హడావిడిగా సుజాత గదిలోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు మరిది హరి. అంతవరకు తదేకంగా తను చూస్తున్న ఫోటోను సూట్ కేస్‌లో బట్టల కిందికి తోసేస్తూ, ఉలికిపాటు దాచుకుందామని సుజాత చేసిన ప్రయత్నం హరి గమనించినట్లున్నాడు. "ఏమిటొదినా అదీ?" అన్నాడు ఆసక్తిగా.




"ఏమీ లేదు, ఏమీ లేదు..." కంగారుగా అంటూ సుజాత మరిది దృష్టిని మరల్చేందుకు "ఏమిటి హరీ... ఇలా వచ్చావు?" అంది.

"ఏమీ లేదొదినా. నేను కోరుకొండ స్కూల్‌లో చేరడానికి ఎంట్రన్స్ రాశాను కదా. సెలక్టయినట్లు లెటర్ వచ్చింది. నీకు చెప్దామని వచ్చాను" చకచకా చెప్పేసి వేగంగా వెళ్లిపోయాడు హరి, బహుశా ఆ ఆనందవార్తను అందరికీ అందించేందుకేమో. ఏదేమైనా సుజాత ఉస్సురంటూ నిట్టూర్చింది.

ఇది జరిగిన కొన్నాళ్లకు సుజాత అత్తగారు భానుమతి పుణ్యక్షేత్ర సందర్శనకు బయలుదేరింది. ఆమె తన బట్టలు, ఇంకా ఇతర సామగ్రి తీసుకు వెళ్లేందుకు సుజాతను సూట్ కేస్ కావాలని అడిగింది. ఆ మాట వింటూనే సుజాత ముఖం వెలా తెలా పోయింది. కోడలి ముఖ భావాలు గమనించిన భానుమతి మళ్లీ సూట్‌కేస్ అడగలేదు కానీ అత్తాకోడళ్లిద్దరికీ ఈ సంఘటన బాధ కలిగించింది.

ఆ రోజు సుజాత భర్తతో కలిసి సాయి బాబా గుడి నుండి తిరిగి వచ్చేసరికి తమ గది లోంచి మరదలు కంగారుగా బయటకు రావడం కనిపించింది. సుజాతకు ముచ్చెమటలు పోశాయి. రూమ్‌లోకి వస్తూనే సూట్ కేస్ కేసి చూసిన ఆమె గుండె దడదడలాడింది. పక్కనే ఉన్న భర్తకు తన కంగారు కనిపించనీయకుండా ఉండడానికి విశ్వప్రయత్నం చేసి సఫలీకృతురాలయింది.

ఆ తర్వాత కుటుంబ సభ్యులకు, సుజాతకు మధ్య మెల్లమెల్లగా సంబంధాలలో, సంభాషణల్లో ఇంతకు ముందున్న చనువు కరువైంది. ఇది వరకులా కలివిడిగా వారుండలేకపోయారు. కొద్ది రోజుల్లోనే రమేష్ ఇంట్లో అశాంతి గమనించాడు. దీనికి కారణం ఏమై ఉంటుందో అతని ఊహ కందలేదు. ఎవరిని ఏమి ప్రశ్నించినా ఏ అపార్థాలు చోటు చేసుకుంటాయోనన్న భయంతో రమేష్ తనలో రేకెత్తిన అనుమాన బీజాలను అంకురించ నీయలేదు.

ఈ లోపు సుజాత గర్భవతి అన్న విషయం ఆ ఇంటిల్లిపాదినీ ఆనందంలో ముంచెత్తింది. ఇది వరకటి కంటే ఎక్కువగా ఆమె పట్ల ప్రేమ, శ్రద్ధ కనబరుస్తున్నారందరూ. ఇది ఎంతో సంతోష దాయకమైనా సుజాతకు ప్రైవసీ కోల్పోయిన భావన మొదలైంది. ఉమ్మడి కుటుంబాల్లో కొత్తగా పెళ్లయిన జంట స్వేచ్ఛకు పరిమితులుంటాయి. వాటికి తోడు కుటుంబ సభ్యుల్లో ఉండే ఆట పట్టించే తత్త్వం కొత్త కోడలికి మింగలేని వెలగపండు చందమే.

అంతకు రెండు రోజుల ముందు రమేష్ ఏదో ట్రైనింగ్‌కు హైదరాబాద్ వెళ్లాడు. ఆ సమయంలో సుజాత పుట్టింటికి వెళ్తానంది. కాని ఎవరూ ఒప్పుకోలేదు. సుజాత ఏడ్చినా ఫలితం లేక పోయింది. "ఆ పల్లెటూర్లో సరైన వైద్య సదుపాయా లుండవు. వెళ్లొద్దు" అన్నారంతా. ఇది ప్రసవించే సమయం కానందున వెళ్తానంది సుజాత. కానీ ఆమె కోరిక వెంటనే తీరలేదు. పుట్టినింటిపై స్త్రీల కుండే ఆప్యాయతానురాగాలు ప్రశంసించ దగినవే అయినా వాటిని అత్తవారింట ఆమోదయోగ్యంగా పరిగణించరు. ఎవరి వాదాలు వారి కుంటాయి. సొంత కుటుంబాన్ని ఏర్పరచుకున్న స్త్రీ భర్త మాటను పాటించడమే అనుసరణీయంగా భావిస్తుంది. అలాగే సుజాత కూడా అత్త వారింట్లోనే ఉండిపోయింది.

భానుమతి అప్పటికి నాలుగైదు సార్లు పిలిచినా సుజాత పలకక పోవడంతో కంగారు పడుతూ కోడలి గదిలోకి వెళ్లింది. సుజాత మంచంపై పడుకుని ఏదో ఫోటో వంక తదేకంగా చూస్తోంది. అత్తగారి రాకను గమనించలేదామె. కోడలి ఏకాగ్రతను భంగపరచలేదు భానుమతి. ఆమె పిల్లిలా గది బయటకు వెళ్లి కోడలిని గట్టిగా పిలిచింది. ఆ తర్వాత కోడలితో మాట్లాడుతున్నా తను చూసిన సంగతి సుజాత గ్రహించకుండా జాగ్రత్తపడినా ఆ ఫోటో ఎవ్వరిదో తెలుసుకోవాలన్న ఉత్సుకతను ఆపుకోలేని భానుమతి, సుజాత స్నానానికి వెళ్లినప్పుడు ఆమె సూట్ కేస్ తీసే ప్రయత్నం చేసింది. కానీ తాళం వేసి ఉన ఆ సూట్ కేస్‌ను ఆమె అప్పుడే కాక ఆ తరువాత రెండు రోజుల్లోనూ తెరవలేకపోయింది.

రమేష్ ట్రైనింగ్ నుండి వచ్చినాక అతడితో ఫోటో విషయం చెప్పాలా వద్దా అనే విషయమై భానుమతి ఏ నిర్ణయానికీ రాలేకపోయింది. ఈ విషయంలో భర్తను సంప్రదించాలని నిర్ణయించుకుని భర్తతో ఫోటో గురించి చెప్పింది. ఆయన ముందు భానుమతి అనుమానాన్ని తోసిపుచ్చినా, తరువాత చిన్నకొడుకు, కూతురు కూడా ఫోటో విషయం ధ్రువపరచడంతో రమేష్‌తో ఈ విషయం చెప్పడానికి నిర్ణయించారు. చిన్న వాళ్ల విషయాల్లో పెద్దల ప్రమేయం, వాళ్ల అభిప్రాయాలకు ప్రాముఖ్యానివ్వడం ఉమ్మడి సంసారాల్లో జరుగుతున్నదే అయినా, అది అభిలషణీయం కాదు. అయితే సుజాత అత్తమామలు తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పట్టే పని కాదు. ఒకవేళ సుజాత పరాయి పురుషుడి ఆకర్షణలో ఉంటే ముందుగా మేల్కొని ఆ సంసారాన్ని సరి దిద్దాలని వారి ఆలోచన.

రమేష్ ట్రైనింగ్ నుండి తిరిగి వచ్చిన మర్నాడు సుజాత లేకుండా చూసి ఫోటో విషయం అతని చెవిలో ఊదారు తల్లిదండ్రులు. అతడి ముఖంలోకి ఉప్పెనలా పొంగుకొచ్చిన రక్తం అంత వేగంగా వెనక్కు మళ్లడంతో కళావిహీనమై, జీవరహితమై, అభావమై పాలిపోయింది. ఏ భర్తా వినాలనుకోని విషయం, అందులోనూ ప్రాణప్రదంగా ప్రేమించే భార్య మరెవరి ప్రేమనో కోరుకుంటోందన్న ఆలోచన రమేష్ భరించలేకపోయాడు. రివ్వున వెనుదిరిగిన అతని మదిలో విచక్షణ మేల్కొంది. తల్లిదండ్రులు చెప్పినా అతని గుండె గుడిలో ఎక్కడో తన దేవత తనను మినహా మరెవరినో కోరుకోదనే బలమైన నమ్మకం అతనిలో స్థిరత్వాన్ని పెంచింది. అయినా ఈ విషయంలో వాస్తవం గ్రహించాలన్న ఆసక్తి అతనిలో పొగలా ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉంది.

ఆ రాత్రి అందరూ పడుకుని ఉంటారను కుంటూ మెల్లగా సుజాతను అడిగాడు రమేష్

"నేను ట్రైనింగ్‌కు వెళ్లినప్పుడు నీకెలా కాలక్షేపం అయ్యింది?"

"ఎలాగా? మిమ్మల్ని తలచుకుంటూ."

"అంతేనా!?" అనుమానం ధ్వనిస్తుండగా అన్నాడు రమేష్.

"ఇంకా ఉంది... ఇదిగో వీడెలా ఉంటాడా అని ఊహించుకుంటూ కూడా" రమేష్ చేతిని తన పొట్టపై ఉంచుకుంటూ అంది సుజాత.

ఒక్కసారి రమేష్ ఒళ్లు పులకరించినా అంతలోనే అనుమానం ఆవరించింది. 'ఇంతకీ ఈ గర్భం తన వల్లనేనా?' మరుక్షణమే అతని ఆలోచనే అతనికి జుగుప్సాకరంగా అనిపించింది. మగవాడు ఎంత నీచంగానైనా ఆలోచించగలడని అతని కప్పుడనిపించింది.

"ఏంటండీ? ఆలోచిస్తున్నారు?" సుజాతలో ఏదో భయం ప్రవేశించినట్లుగా ఉంది ఆమె మాటలు.

'అడగాలా వద్దా' అనే సందిగ్ధంలో ఉన్నాడు రమేష్. 'అడిగితే... తన తల్లిదండ్రులు చెప్పింది నిజమైతే... ఓ మైగాడ్...' ఆ తర్వాత ఊహించుకో లేకపోయాడు. అలాగని తనలోని అనుమానాన్ని అణుచుకోలేకపోయాడు. "ఒక్కసారి లైట్ వేసి నీ సూట్ కేస్ ఇలా తీసుకురా!"

ఆ మాటలతో పాలిపోయిన సుజాత ముఖాన్ని చూస్తే రమేష్ తల్లిదండ్రుల అనుమానాన్ని ధ్రువీకరించుకునేవాడేమో కానీ మసకవెలుతురులో అతడు ఆ మార్పులు గమనించలేదు.

"ఇప్పుడెందుకు సూట్ కేస్...?" ఎంత దాచుకుందామన్నా దాగని తడబాటు ఆమె మాటల్లో.

ఆ తత్తరపాటు గ్రహించాడు నరమేష్. "దొంగను పట్టుకోవడానికి" నవ్వుతూ అన్నా అతని మాటల్లో శాడిజమ్‌తో కూడిన కసి మిళితమై ఉంది. ప్రతి సాధారణ పురుషుడూ భార్యను చేతలతో కంటే మాటలతో ఎక్కువగా హింసిస్తాడు. కానీ అలా ఏర్పడిన గాయాలు చివరికి భార్య హృదయంలో తన రూపంపై మచ్చలుగా మిగులు తాయని గ్రహించే వివేకం ఉండదు. ఈ హింసకు కారణం భార్య పాత్రలో ఉన్న స్త్రీలోని అవిద్య, ఆధారపడే తత్వం, అమిత ప్రేమ, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం, ఇలా ఎన్నైనా.

"సూట్ కేస్‌లో దొంగలెవరూ లేరు. రేప్పొద్దున తీరిగ్గా వెదుక్కోండి. ఇప్పుడు పడుకోండి" కంగారు నుండి తేరుకున్న సుజాత అనునయంగా అంది.

"చీకట్లో దొంగను పట్టుకుంటేనే మజా! అదీగాక మీ ఆడవాళ్లు వెలుతుర్లో రహస్యాలు చూపరుగా!"

ద్వంద్వార్థంతో ఉన్న భర్త మాటల్లోని చిలిపి తనాన్ని మరొకప్పుడైతే ఆమె ఆస్వాదించేదేమో గానీ ఇప్పుడా స్థితిలో లేదు.

మెల్లగా లేచి వెళ్లి లైట్ వేసి సూట్ కేస్ తీసుకొచ్చి భర్త ముందు ఉంచింది సుజాత. ఆమె భర్త ముఖాన్ని చూడలేకపోతున్నట్లు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. రమేష్ ఒక్కొక్క చీర బయటికి తీసి చూస్తున్నాడు.

సుజాతకు గుండె చప్పుళ్లు సంబరంలో డప్పులను తలపిస్తున్నాయి. ఆ శబ్దం రమేష్‌కు వినిపిస్తుందేమోనని అనుమానం. 'ఇక లాభం లేదు. ఛీ... తనే తప్పు చేసింది. అంత ప్రేమను దాచుకోలేక ఫోటో చూసుకోవడం... అదీ మరిది గమనించిన తర్వాత మానుకున్నా బాగుండేది. ఇప్పుడా ఫోటో బయట పడితే.... ఎలా తలెత్తి చూడగలదు? ఇంటిల్లిపాది ముందూ వాళ్ల ఎగతాళి భరిస్తూ...' ఆమె ఆలోచనలు ఆగిపోయాయి.

రమేష్ ఆకుపచ్చ చీర ఒక చేత్తో పైకెత్తి మరో చేత్తో దులుపుతున్నాడు.

దాచేస్తే దాగని సత్యంలా ఫోటో జర్రున జారి సుజాత కాళ్ల దగ్గర బోర్లా పడింది. గభాలున ఆమె తన రెండు చేతుల్తో ఆ ఫోటోను అదిమి పట్టుకుంది.

"ఆ ఫోటో ఇలా ఇవ్వు" నెమ్మదిగా ఉన్నా రమేష్ కంఠం కరకుగా ఉంది. నిశ్శబ్దంగా ఉన్నా వధ్యశిల కత్తికే సహకరిస్తుంది.

"నేనివ్వను!" పంతంగా అంది సుజాత.

"ఎలా ఇవ్వవో చూస్తాను!" ఆమె చేతులు లాగేస్తూ అన్నాడు రమేష్. గట్టిగా చేతులు ఆనించి ఉండడంతో ఆమె బోర్లా పడింది. అంతలోనే సర్దుకుని తన రెండు చేతుల్తో ఫోటోను ఉండలా చుట్టి నోట్లో ఉంచుకుంది.

ఈ హడావుడికి ఇంట్లో అందరూ లేచారు. రమేష్ గుండె మండుతున్న వెలుతురు ముఖంలో కనిపిస్తోంది. విసురుగా వెళ్లి గది తలుపులు తీసి "రండి... అమ్మా నాన్నా... ఇదిగో ఈ పాపిష్టి దాని నిజస్వరూపం చూడండి. నిజాన్ని మింగాలని చూస్తోంది" అరుస్తున్నాడు రమేష్.

"ఏమీ ఎరగని దానిలా ఏంటమ్మా అదీ...?" సాగదీస్తూ అంది భానుమతి.

"అదెలా మాట్లాడుతుంది? నోరు విప్పితే అది చేసిన పాపం ఫోటో రూపంలో బయటకి రాదూ..." కసిగా అంటున్నాడు రమేష్.

సుజాతకు ఈ అల్లరి, అరుపులు అవమా నంగా తోచాయి. వాళ్లేమి మాట్లాడుకుంటున్నారో అర్థం కాలేదు ఆమెకు.

"ఏమే! నీ కడుపులో బిడ్డకు తండ్రెవరో చెప్పు..." జబ్బ పట్టుకుని బలంగా పీకుతూ అరిచాడు రమేష్.

ఆ మాటలో సుజాత కళ్లు ఆశ్చర్యంతో పత్తి పువ్వుల్లా విచ్చుకున్నాయి. కళ్లప్రమేయం లేకుండా కన్నీరు పొంగుకొచ్చింది. బావురుమని ఏడుస్తూ నోట్లో ఫోటో బయటకు తీసి నలిగిన మడతలు సరి చేస్తూ ముఖం మీద పెట్టుకుని మరింత గట్టిగా ఏడ్చింది.

ఆ గదిలోని ఆరు కళ్లూ ఆత్రంగా ఆ ఫోటో వంక చూశాయి. లేగదూడను కావులించుకుని ఉంది సుజాత ఆ ఫోటోలో!

రెప్పల కింద దాగిన ఆ కళ్ల నుండి చిప్పిల్లిన కన్నీరు ఆ ముగ్గురినీ నిశ్చింతగా ఉంచగలదేమో గానీ, సుజాత మనఃఫలకంపై ఆ దృశ్యం ఆజన్మాంతం చెరగక నిలుస్తుంది.

